## క్లుప్తంగా

### బంగారు, వెండి పుష్పాలతో మరిడమ్మకు పూజలు



వెండి, బంగారు పుష్పాలతో అమ్మవారు

**పెద్దాపురం:** కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో ఘనంగా పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావు ఆధ్వర్యంలో కార్తిక మాస ద్వాదశి పూజల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు, బంగారు, వెండి పుష్పాలతో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**ఘనంగా చండీహోమం**

పౌర్ణమి సందర్భంగా ఆలయంలో చండీహోమం నిర్వహించారు. ఆలయ ఈఓ సీహెచ్‌వీ రామ్మోహనరావు, ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య వైభవంగా హోమాన్ని జరిపించారు.

### భూసార పరీక్షలపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న పీడీ

**పెద్దాపురం:** విద్యార్థులకు భూసార పరీక్షలపై అవగాహన అవసరమని కాకినాడ జిల్లా ఆత్మ పీడీ జ్యోతిర్మయి అన్నారు. స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో శుక్రవారం భూసార పరీక్షల నిర్వహణ, సేంద్రియ సాగు పద్ధతులపై అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఆర్.కమలం అధ్యక్షత వహించారు. పీడీ జ్యోతిర్మయి మాట్లాడుతూ విద్యార్థులకు వ్యవసాయ రంగంపై పూర్తి అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రతిఒక్కరూ సేంద్రియ ఆహార పంటలను తీసుకోవాల్సి ఉందన్నారు. విద్యార్థులకు సేంద్రీయ సాగు పంటలు, సారవంత నేలలు, భూసార పరీక్షలపై అవగాహన కల్పించేందుకు వ్యవసాయ రంగ శాస్త్రవేత్తలు, అధికారులు ఈ సదస్సు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డాట్ సెంటర్ సీనియర్ శాస్త్రవేత్త నరసింహరావు, ఏడీఏ డీఆర్‌సీ శారద, భూసార పరీక్ష కేంద్రం ఏఓ పవిత్ర, ఏఈఓ ఎస్‌వీవీ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య పాల్గొన్నారు.

### తీరంలో ఏర్పాట్ల పరిశీలన



ఉప్పాడ తీరప్రాంతంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాస్

**కొత్తపల్లి:** మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించే భక్తులు జాగ్రత్తలు పాటించాలని పిఠాపురం సీఐ శ్రీనివాస్ సూచించారు. మండలంలోని ఉప్పాడ తీర ప్రాంతంలో పుణ్యస్నానాల ఏర్పాట్లను ఎస్సై స్వామి నాయుడుతో కలిసి శుక్రవారం రాత్రి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీరంలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో మాత్రమే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించాలన్నారు. భక్తులు తమ పిల్లలు, వృద్ధులు, విలువైన వస్తువులను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. స్నానాలు చేసేందుకు కెరటాల్లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లరాదన్నారు. గ్రామ పంచాయితీ అధికారులు భక్తులకు అవసరమైన తాగునీరు, ఇతర వసతులు ఏర్పాటు చేశారన్నారు. భక్తులు పోలీసులు, అధికారులకు సహకరించాలని కోరారు.

### బ్యాంకు లోన్ పేరుతో మోసం

**పిఠాపురం:** బ్యాంకు లోన్లు ఇప్పిస్తానని నమ్మించి వారి నుంచి ఆధార్‌కార్డు, ఫొటోలు సేకరించి వారికి తెలియకుండా ఎక్కువ మొత్తంలో లోన్లు తీసుకుని మోసం చేసిన ఘటన పిఠాపురంలో చోటు చేసుకుంది. కాకినాడకు చెందిన చిన్ని అనే మహిళ తమను మోసం చేసి తమ పేరున లోన్లు తీసుకుందని శుక్రవారం బాధితులు పిఠాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పిఠాపురం పోలీసులు కేసు నమోదు చేయగా ట్రైనీ డీఎస్పీ ప్రమోద్ విచారణ చేపట్టారు. విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరుతూ గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన మహిళా సంఘాల సభ్యులు గొల్లప్రోలు పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన నిర్వహించారు.

# సొంతూరులోనే ఉన్నత చదువులు

- హైస్కూళ్లను ఇంటర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసిన ప్రభుత్వం
- ప్రతి మండలానికి రెండు జూనియర్ కాలేజీలు
- పేదలకు మరింత చేరువైన ఇంటర్ విద్య
- ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థినులు



చేబ్రోలులో సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న విద్యార్థినులు



చేబ్రోలు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో తరగతులకు హాజరైన విద్యార్థులు

**పిఠాపురం:** ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. పేదరికంతో ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఇప్పటికే అమ్మఒడి, జగనన్న విద్యా కానుక వంటి పథకాలను అమలు చేస్తున్న ప్రభుత్వం ఇప్పుడు ఉన్నత విద్యను సైతం బాలికలు, పేద విద్యార్థులకు చేరువ చేసింది. ప్రతి మండలానికి రెండు జూనియర్ కళాశాలల ఏర్పాటు చర్యలు తీసుకోవడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**గతంలో ఇక్కట్లు**

గతంలో పలు గ్రామాల్లో కేవలం ప్రాథమిక పాఠశాలలే ఉండేవి. హైస్కూల్‌కు వెళ్లాలన్నా పక్క ఊరు, మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. పై చదువులు చదవాలంటే ప్రైవేటు స్కూళ్లకు, కాలేజీలకు వెళ్లక తప్పేది కాదు. అలాంటి పరిస్థితుల్లో పక్క ఊరు వెళ్లలేక ప్రైవేటు స్కూల్లో చదువుకునే స్థోమత లేక అనేక మంది నిరుపేద పిల్లలు చదువులు ఆపేసే పరిస్థితి. ఇంటర్ చదవాలంటే కొన్ని గ్రామాల నుంచి కిలోమీటర్ల దూరం ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రయాణించాల్సి రావడంతో పాటు కుటుంబంపై ఆర్థిక భారం పడేది. ఈ నేపథ్యంలో హైస్కూళ్లు అందుబాటులోకి రావడంతో విద్యార్థులకు కొంతమేర కష్టాలు తప్పాయి. పదో తరగతి అనంతరం పక్క ఊరికి వెళ్లక తప్పని పరిస్థితుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ప్రతి మండలంలోనూ జూనియర్ కాలేజీని ఏర్పాటు చేశారు. దీంతో పదో తరగతి తర్వాత ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా ఉన్న ఊరిలోనే ఇంటర్ పూర్తి చేసే అవకాశం వచ్చిందని ఇంటర్ విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థినుల ఆనందానికి అవధుల్లేవు. రెండేళ్ల క్రితం పలు జెడ్పీ హైస్కూళ్లలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ పూర్తి చేస్తున్న విద్యార్థినులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

### ఇంటర్ కూడా మా స్కూల్‌లోనే...



నా పేరు ఓరుగంటి లలితాదేవి. మాది గొల్లప్రోలు మండలం చేబ్రోలు. నేను చిన్నప్పటి నుంచి చేబ్రోలు స్కూల్లో చదువుకున్నా. మా ఊళ్లో పదో తరగతి వరకు ఉండడంతో టెన్త్ పూర్తయ్యాక పక్క ఊరు వెళ్లి చదువుకోవాలంటే భయమేసేది. చాలా టెన్షన్ పడేదానిని. కాని సీఎం జగన్ మావయ్య ముందు చూపుతో ఆలోచించి ప్రభుత్వ హైస్కూళ్లను జూనియర్ కాలేజీలుగా మార్చారు. దీంతో అప్పటివరకు చదువుకున్న వారితోనే మళ్లీ ఇంటర్ చదువుకునే అవకాశం రావడం, ఇప్పటి వరకూ మాకు చదువు చెప్పిన ఉపాధ్యాయులే మాకు లెక్చరర్లుగా రావడంతో భయం పోయింది. ఇంటర్ కూడా మా స్కూల్లోనే చదువుకోవడం ఆనందాన్ని ఇచ్చింది. బాగా కష్టపడి చదివి ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు సిద్ధమయ్యాం. ఇంత ఆనందంగా ఇంటర్ పూర్తి చేసుకున్నామంటే అదంతా సీఎం జగన్ దీవెనలే.

### ఇంటర్ వరకు ఇంటి దగ్గరే అన్నట్టుగా..



నా పేరు వులవకాయల చార్మి. మాది గొల్లప్రోలు మండలం చేబ్రోలు. నేను ఒకటో తరగతి నుంచి చేబ్రోలులోనే చదువుకున్నా. అంగన్‌వాడీ సెంటర్, ప్రాథమిక పాఠశాల, హైస్కూల్ మా ఇంటికి దగ్గరలోనే ఉన్నాయి. పదో తరగతి వరకూ అంతా ఇంటి దగ్గరే ఉన్నట్టు ఉండగా ఇంటర్‌కు మాత్రం బయటకు వెళ్లక తప్పదని అనుకున్నా. అప్పటి వరకు ఇంటి దగ్గరే చదువుకుని పక్క ఊరు వెళ్లాలంటే కొంచెం భయమేసేది. కాని పదో తరగతి పూర్తయ్యే సరికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మా ఊరి స్కూల్‌ను జూనియర్ కాలేజీగా మార్చడంతో మాకు ఇబ్బందులు తప్పాయి. మా తల్లిదండ్రులకు ఆర్థిక భారం లేకుండాపోయింది. చాలా సంతోషంగా ఇంటి దగ్గరే ఇంటర్ పూర్తి చేసుకున్నాం.

### ఇప్పుడు ఎక్కడైనా చదవగలం



నా పేరు దమ్ము సిరిదుర్గ. మాది గొల్లప్రోలు మండలం చేబ్రోలు. హైస్కూల్ చదివినంత వరకూ ఒక రకంగా చిన్న పిల్లలుగానే ఉంటాం. కాని ఇంటర్ అంటే వేరే లోకంలోకి వెళుతున్నట్టే. కొత్త ప్రదేశం, కొత్త ఊరు, కొత్త స్నేహితులు ఇలా అన్నీ కొత్తగా ఉంటాయి. అలాంటి కొత్త లోకంలోకి అడుగు పెట్టాలంటే అందరికీ టెన్షన్ ఉంటుంది. అలాంటిది మాకు ఎలాంటి టెన్షన్ లేకుండా ఇంటర్ మా ఊళ్లోనే చదువుకునే వీలు కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. ప్రస్తుతం కాలేజీ అంటే భయం పోయి ఇప్పుడు ఎక్కడికైనా వెళ్లి చదవగలం అనే ధైర్యం వచ్చింది.

### పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు ఉండాలి



విద్యార్థుల పుస్తకాలను పరిశీలిస్తున్న డీఈఓ

**సామర్లకోట:** ప్రతి విద్యార్థికి విద్యపై పూర్తి అవగాహన ఉండాలని, చదవడం, రాయడం కచ్చితంగా రావాలని డీఈఓ పి.రమేష్ అన్నారు. అచ్చంపేటలోని యూపీ స్కూల్, నవర జెడ్పీ హైస్కూల్‌ను శుక్రవారం సాయంత్రం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలోని విద్యార్థులకు అవసర మైన అన్ని మౌలిక సదుపాయాలు ఉండాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని, ఈ తరుణంలో అవసరాలను ప్రతి నెలా సమీక్ష నిర్వహించి, గుర్తిస్తున్నట్టు వివరించారు. సదుపాయాల కొరత ఉన్నట్టు గమనిస్తే హెచ్‌ఎంలపై చర్యలుంటాయని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థుల పుస్తకాలను పరిశీలించి, పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగారు. విద్యార్థుల పుస్తకాలను ప్రతి రోజు ఆయా క్లాసు టీచర్లు పరిశీలించాలన్నారు. విద్యార్థుల ప్రవర్తనకు సంబంధించి తల్లిదండ్రులతో చర్చించాలని సూచించారు. ప్రతి పాఠశాల పరిశుభ్రంగా ఉండాలన్నారు. హైస్కూళ్లకు మంజూరు చేసిన ఇంటిగ్రేటెడ్ ఫ్లాట్ ప్యానెల్‌ను ప్రతి రోజూ వినియోగించాలన్నారు. నాడు–నేడులో మంజూరైన నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలలను తరుచూ ఎంఈఓ–2 తనిఖీ చేయాలన్నారు. విద్యార్థులు ప్రతిరోజూ యూనిఫాంతో పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని హెచ్‌ఎంలకు సూచించారు. ఆయన వెంట ఎంఈఓ–2 పి.పుల్లయ్య, హెచ్‌ఎంలు శ్రీనివాసు, సత్యవతి ఉన్నారు.

## ఎన్నికల నిర్వహణ బాధ్యతగా భావించాలి

**ఆర్డీఓ జేఎస్ రామారావు**



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు

**పెద్దాపురం:** ఎన్నికల విధుల నిర్వహణను బాధ్యతగా భావించి, ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు యంత్రాంగం కృషి చేయాలని పెద్దాపురం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ జేఎస్ రామారావు అన్నారు. సార్వత్రిక ఎన్నికలను సమర్థంగా నిర్వహించేందుకు శిక్షణ తరగతులు దోహదపడతాయన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో శుక్రవారం సెక్టోరియల్, పోలీస్ అధికారులకు రెండు రోజుల శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వర్తించే సిబ్బంది సమయపాలన కచ్చితంగా పాటించాలని, లేకుంటే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన టీము అధికారులు, సిబ్బంది వారికి ఇచ్చిన సమయానికి అందుబాటులో ఉండాలన్నారు. ఎన్నికల విధుల్లో ప్రతి టీము తమ రోజువారీ రిపోర్టును, వీడియోను రిజిస్టర్‌లో పొందుపర్చి, సాయంత్రానికి టీము లీడర్‌కు అందజేయాలన్నారు. చెక్ పోస్టు వద్ద సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలనే ఆదేశించారు. నియోజకవర్గంలో 200 పోలింగ్ కేంద్రాలున్నాయని, వీటికి 22 మంది సెక్టోరియల్, 22 మంది పోలీసులు వెరసి 44 మంది రిజర్వ్‌తో కలిపి శిక్షణ ఇస్తారని చెప్పారు. అనంతరం ఈవీఎం, వీవీ ప్యాట్, ఏజెంట్లు, మాక్‌పోల్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎస్పీ లతాకుమారి, డీఎల్‌పీఓ బాలామణి, సీఐ రవికుమార్, ఎస్సై వి.సురేష్, సీడీపీఓ ఉష, మున్సిపల్ డీఈ ఆదినారాయణ పాల్గొన్నారు.

## ఓటర్లను చైతన్యవంతుల్ని చేయాలి

**బూత్ కమిటీ సభ్యులతో దవులూరి దొరబాబు**



సమావేశంలో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు



సురేష్ మహరాజ్‌ను సత్కరించిన దొరబాబు

**సామర్లకోట:** బూత్ కమిటీ సభ్యులు ఓటర్లను చైతన్యవంతుల్ని చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక పార్టీ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం పెద్దాపురం మున్సిపాలిటీలోని బూత్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయా బూత్‌ల్లో ఓటర్ల సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. ఆయా బూత్‌ల పరిధిలో ఉండే పోలింగ్ స్టేషన్లపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. పోలింగ్ బూత్ పరిధిలోని వంద శాతం ఓటర్లు ఓటింగ్‌లో పాల్గొనేలా చూడాలన్నారు. ఇంటింటా ఓటర్లను కలిసి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను ఎలా అమలు చేశారో వివరించాలన్నారు. స్వార్థపరులకు, పేదలకు మధ్య జరిగే యుద్ధంలో ఓటర్లు వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించడానికి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కౌన్సిలర్లు, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**ధ్యానంతో మానసిక ప్రశాంతత**

**సామర్లకోట:** భగవంతుడిని మనస్సుతో ధ్యానం చేయడం వల్ల ప్రశాంతత, ఆనందం కలుగుతుందని అఖిల భారతీయ సంతమత్ సత్సంగ్ సంరక్షకుడు సురేష్ మహరాజ్ అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం స్థానిక ప్రసన్నాంజనేయ నగర్‌లో జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మానవ జన్మ ఎంతో పవిత్రమైనదన్నారు. మానవ జన్మ ప్రసాదించినందుకు కృతజ్ఞతగా పరమాత్ముడిని ఆరాధించాలన్నారు. సృష్టిలోని అన్ని ప్రాణులూ పరమాత్మను చేరుకోవడానికి ప్రయత్నిస్తాయని, ఏదో ఒక మార్గం ద్వారా పరమాత్మ తన వైపు ఆకర్షించుకుంటాడన్నారు. ఆత్మ జ్ఞానం అనేది అనుభవానికి సంబంధించిన విషయమన్నారు. వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు ముఖ్య అతిథిగా పాల్గొని, సురేష్ మహరాజ్ ఆశీస్సులు పొంది, ఆయనను సత్కరించగా, దొరబాబును ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, సత్సంగ్ సభ్యులు పాల్గొన్నారు.

## పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ వైద్యం



పాత ఇసుకపల్లిలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు



రోగులకు మందులను పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

**కొత్తపల్లి:** ప్రభుత్వం పేదలకు పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ వైద్య సేవలు అందిస్తోందని నాగులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సౌజన్య అన్నారు. మండలంలోని పాత ఇసుకపల్లి గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని 420 మందికి వైద్యాధికారి సౌజన్య పర్యవేక్షణలో డాక్టర్లు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఆసుపత్రుల్లో పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని నియమించిందన్నారు. ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### టౌన్ ప్లానింగ్ డైరీల ఆవిష్కరణ



డైరీలను ఆవిష్కరించిన కమిషనర్

**సామర్లకోట:** రాష్ట్ర ప్రభుత్వం నుంచి మున్సిపాలిటీకి వచ్చిన టౌన్ ప్లానింగ్ టెక్నికల్ అసోసియేషన్ డైరీలను మున్సిపల్ కమిషనర్ జె.రామారావు శుక్రవారం ఆవిష్కరించారు. సచివాలయాల్లో టెక్నికల్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న వారికి ఈ డైరీలు దోహదపడతాయని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి ఫణికుమార్, డీఈ ఎ అనంతలక్ష్మి, సచివాలయాల టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

### ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

**కొత్తపల్లి:** ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశానికి అర్హులైన పేద విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు మండల విద్యాశాఖాధికారి వేణుగోపాల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యాహక్కు చట్టం ప్రకారం 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి అన్ని ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో అనాథలు, విభిన్న ప్రతిభావంతులు, హెచ్‌ఐవీ బాధితులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, ఓసీ పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాలన్నారు. దీనిలో భాగంగా అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు మార్చి 14వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## సంక్షేమ సారథులు వలంటీర్లే..

**వందనం కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ దొరబాబు**



అవార్డు గ్రహీతలను సత్కరించిన దొరబాబు తదితరులు

**సామర్లకోట:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా అందే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీరు వ్యవస్థను తీసుకొచ్చారని, వలంటీర్లే సంక్షేమ పథకాల సారథులని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని వలంటీర్లకు సత్కారాలు సందర్భంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు అర్హులను వలంటీర్ల ద్వారా ఎంపిక చేసి, లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా లబ్ధి చేరేలా చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగడంతో పాటు, వలంటీరు వ్యవస్థ ఉండాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి కావాలన్నారు. వలంటీర్ల ద్వారా అందుతున్న సేవల కారణంగానే రాష్ట్రంలోని 175 స్థానాల్లోను విజయం సాధిస్తా మనే ధీమాతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారని తెలిపారు. ప్రజలకు మేలు జరగడంతోనే ధైర్యంగా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని వలంటీర్లతో కలిసి విజయవంతం చేయగలిగామన్నారు. వలంటీర్లకు మంచి భవిష్యత్తు ఉంటుందని దొరబాబు తెలిపారు. వలంటీర్లను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రతి ఏటా సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులిచ్చి ప్రోత్సహిస్తున్నారని, అవార్డుల పారితోషికం పెంచారన్నారు. మండలంలో ఐదుగురు సేవా రత్నా, 482 మంది సేవా మిత్రాలుగా ఎంపికై నట్టు చెప్పారు. పోలింగ్ రోజు వరకూ ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో జరిగిన మేలును వివరించాల్సిన బాధ్యత వలంటీర్లపై ఉందన్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలను సత్కరించారు. కార్యక్రమానికి ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అధ్యక్షత వహించగా, ఎంపీడీఓ ఎస్‌డీ శ్యామ్‌సుందర్, ఈఓ పీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి తలారి దొరబాబు, ఎలిశెట్టి నరేష్, మండల అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మోరంపూడి రమేష్, సొసైటీ అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలపై మరింత నిఘా

**జిల్లా ఎస్పీ సతీష్ కుమార్**



కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

**కిర్లంపూడి:** మండలంలో శాంతి భద్రతలపై మరింత నిఘా ఏర్పాటు చేసినట్టు జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ తెలిపారు. సాధారణ తనిఖీల్లో భాగంగా శుక్రవారం కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని సమస్యాత్మక గ్రామాల్లో మరింత భద్రతను పెంచుతామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పాత కేసుల్లో ముద్దాయిలపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నట్టు తెలిపారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎస్సై ఎన్.రామలింగేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ ఎన్‌వీ రమణ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## రైతు, కార్మిక సంఘాల ధర్నా

**కాకినాడ సిటీ:** చనిపోయిన రైతుల కుటుంబాలకు నష్ట పరిహారం చెల్లించాలని కోరుతూ ఢిల్లీ సరిహద్దుల్లో రెండో దఫా రైతాంగం మొదలుపెట్టిన ఉద్యమంపై హర్యానా బీజేపీ ప్రభుత్వం పోలీసులతో కాల్పులు జరిపించడంతో 23 ఏళ్ల యువ రైతు మృతి చెందిన ఘటనకు నిరసనగా రైతు, కేంద్ర కార్మిక సంఘాల నాయకులు శుక్రవారం స్థానిక కలెక్టరేట్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. మోదీ తెచ్చిన మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా రైతాంగం చేసిన 15 నెలల పోరాటం సందర్భంగా, మోదీ ప్రభుత్వం దేశ రైతాంగానికి క్షమాపణలు చెబుతూ ఇచ్చిన హామీలు మూడేళ్లు గడుస్తున్నా అమలు చేయలేదని విమర్శించారు. గత పదేళ్ల కాలంలో మోదీ విధానాల ఫలితంగా 1.60 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆందోళనకారులు వివరించారు. వివిధ సంఘాల నాయకులు, రైతు సంఘాల నాయకులు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, రాజశేఖర్, టేకుమూడి ఈశ్వరరావు, వల్లూరి రాజాబాబు, చెక్కల రాజ్ కుమార్, దూసర్లపూడి రమణరాజు పాల్గొన్నారు.

### వృద్ధుడి అదృశ్యంపై ఫిర్యాదు

**కాకినాడ క్రైం:** కాకినాడకు చెందిన ఓ వృద్ధుడి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. అశోక్‌నగర్ అబ్దుల్ కలామ్ మార్గ్‌కు చెందిన 83 ఏళ్ల పేద్ద ప్రకాశరావు ఈ నెల 20వ తేదీన మధ్యాహ్నం ఇంటి నుంచి బయటికి వెళ్లి, తిరిగి రాలేదు. తెలిసిన వారి వద్ద, బంధువుల ఇళ్లలో గాలించినా ఫలితం లేకపోయింది. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. అతను 5.2 అడుగుల ఎత్తు, చామన ఛాయ మేని వర్ణంతో ఉంటారు. ఆయన ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు కుంకుమ రంగు లుంగీ, ఖద్దరు బనియన్, గోధుమ వర్ణం స్వెట్టర్ ధరించి ఉన్నారని కాకినాడ టూ టౌన్ సీఐ నాగేశ్వర్ నాయక్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 79891 21001, 94407 96541 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

### 25న ఉద్యోగుల సంఘ ఎన్నికలు

**కాకినాడ సిటీ:** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆంధ్రప్రదేశ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా ఎన్నికలు ఈ నెల 25న కాకినాడ రెవెన్యూ భవనంలో నిర్వహిస్తున్నట్టు ఎన్నికల అధికారి పి.దుర్గాప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఏపీజేఏసీ అమరావతిలో సభ్య సంఘమైన ఆంధ్రప్రదేశ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ మల్లేశ్వరరావును, తనను ఎన్నికల అధికారులుగా నియమించినట్టు ఆయన చెప్పారు.

## యువతికి న్యాయం చేయాలంటూ ఆందోళన

**ఏలేశ్వరం:** ప్రేమించిన వ్యక్తి మోసం చేశాడని మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నం చేసిన యువతికి న్యాయం చేయాలని కోరుతూ పట్టణంలో శుక్రవారం మహిళలు ఆందోళన చేశారు. సీపీఐ(ఎంఎల్)వినోద్‌మిశ్రా పార్టీ ఆధ్వర్యంలో మహిళలు ఆందోళన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వినోద్ మిశ్రా పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ మాట్లాడుతూ వినోద్‌మిశ్రా నగర్‌కు చెందిన యువతిని అదే ప్రాంతానికి చెందిన రవికుమార్ మోసం చేయడం దారుణమన్నారు. యువతికి న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామన్నారు. మహిళల హక్కుల రక్షణ కోసం తమ పార్టీ పోరాడుతుందన్నారు. యువతిని రవికుమార్ వెంటనే వివాహం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గండేటి నాగమణి, గుమ్మడి పాదాలమ్మ, పిల్లా కాంతం, వరలక్ష్మి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నేడు సత్యదేవునికి జన్మ నక్షత్ర పూజలు

**అన్నవరం:** సత్యదేవుని జన్మనక్షత్రం 'మఖ' సందర్భంగా శనివారం స్వామివారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు, ఆయుష్యహోమం నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. పండితులు తెల్లవారుజామున రెండు గంటలకు స్వామివారి ఆలయం తెరిచి ప్రత్యేక పూజలు చేస్తారు. స్వామి, అమ్మవారు, శంకరుల మూల విరాట్‌లకు పంచామృతాలతో అభిషేకం నిర్వహిస్తారు. అనంతరం పుష్పాలు, స్వర్ణాభరణాలతో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేసి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతిస్తారు. మాఘపౌర్ణిమి, స్వామివారి జన్మ నక్షత్రం ఒకేరోజు రావడంతో ఆలయానికి భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉంది.